# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-06-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **యోగాను జీవితంలో భాగం చేసుకోవాలనే ఉద్యమాన్ని బలోపేతం చేసినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రజలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు.**
2. **ప్రజలందరి సహకారంతోనే గిన్నిస్ రికార్డు సాధ్యపడిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తైన సందర్భంగా "సుపరిపాలనలో తొలి అడుగు" పేరుతో ప్రత్యేక సమావేశాన్ని ఈరోజు నిర్వహించనుంది.**
4. **విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు తెలిపారు.**
5. **సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.**

==========================

యోగాను జీవితంలో భాగం చేసుకోవాలనే ఉద్యమాన్ని బలోపేతం చేసినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. విశాఖపట్నం వేదికగా జరిగిన అంతార్జతీయ యోగా దినోత్సవం రోజున 3 లక్షల 105 మందితో జరిగిన అతిపెద్ద యోగా సాధన తో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ను సాధించిన కార్యక్రమంలో పాల్గొనడాన్ని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం "ఎక్స్" వేదికగా ప్రస్తావించారు. విశాఖ నగరం వేదికగా జరిగిన ఈ కార్యక్రమం అనేక మందిని ఆరోగ్యం, శ్రేయస్సు దిశగా ప్రేరేపిస్తుందన్నారు. యోగా ప్రజలను మరోసారి ఏకం చేసిందని, ఆంధ్రప్రదేశ్ ప్రజలు యోగా అభ్యాసం పట్ల చూపిన స్ఫూర్తిదాయకమైన నిబద్ధతను ప్రధానమంత్రి ప్రశంసించారు.

--------------------------

ప్రజలందరి సహకారంతోనే గిన్నిస్ రికార్డు సాధ్యపడిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ సామాజిక మాధ్యమం వేదికగా యోగా రికార్డుకు సంబంధించిన విషయాన్ని పంచుకుంది. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ… దీనిని సాకారం చేయడానికి కృషి చేసిన ప్రతీ వ్యక్తిని అభినందించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో ప్రజలు చూపిన ఉత్సుకత, నిబద్ధత స్ఫూర్తిని

కలిగిస్తాయని ముఖ్యమంత్రి వివరిస్తూ...

వాయిస్ 25 సెకన్లు

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తైన సందర్భంగా "సుపరిపాలనలో తొలి అడుగు" పేరుతో ప్రత్యేక సమావేశాన్ని ఈరోజు నిర్వహించనుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం వెనుక భాగంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికలో ఈ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో ఏడాదికాలంలో చేపట్టిన పాలనా సంస్కరణలు, తీసుకొచ్చిన మార్పులు, అందించిన సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని సమీక్షించుకునేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఈ కార్యక్రమంలో దిశానిర్దేశం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, రాష్ట్ర మంత్రులు శాసనసభ సభ్యులు, పార్లమెంట్ సభ్యులు హాజరవుతారు.

-----------------------------

దేశంలో అన్ని వర్గాల ప్రజల సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు డి. పురందేశ్వరి అన్నారు. విజయవాడలో నిర్వహించిన బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆమె నిన్న పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ సమ్మేళనాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ,

వాయిస్...27 సెకన్లు

-----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

-----------------------------

విద్యా, వైద్యం, వ్యసాయ రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలు అంశాలపై జిల్లా ఇంఛార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రులు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందించాలని మంత్రి శ్రీధర్ బాబు తెలుపుతూ,

వాయిస్ ..22 సెకన్లు

-----------------------------

తమిళనాడులోని మధురైలో జరిగిన మురుగ భక్తర్గళ్ మానాడులో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఐక్యంగా

పోరాడాలని అన్నారు. హిందూ ధర్మ వ్యతిరేకులకు కొందరి మద్దతు ఉండటం శోచనీయం అని, విజభన ఆలోచనలున్న వారు ప్రమాదకరం అని చెప్పారు. లౌకిక వాదం పేరుతో మతాలను దూషించడం సరికాదని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

భారతదేశంలో జూన్ 25, 1975న, అప్పటి ప్రధానమంత్రి అత్యవసర పరిస్థితిని విధించిన నేపథ్యంలో భారత ప్రభుత్వం ఆ తేదిని 'సంవిధాన్ హత్య దివస్' –రాజ్యాంగ హత్య దినంగా పాటిస్తోంది. 1975 అత్యవసర పరిస్థితిని ఎదుర్కొన్న వారందరిని స్మరించుకుంటూ, ప్రతి భారతీయుడిలో వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రజాస్వామ్య రక్షణపై కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తారు. హింసను ఎదుర్కొన్నప్పటికీ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడానికి పోరాడిన లక్షలాది మంది స్ఫూర్తిని గౌరవించడమే 'సంవిధాన్ హత్య దివస్ నిర్వహణలోని ముఖ్య ఉద్దేశం.

---------------------------

ఆండర్సన్–టెండూల్కర్ క్రికెట్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్ – భారత్ జట్ల మధ్య తొలి టెస్టు మ్యాచ్ మూడో రోజు ఆట ముగిసింది. వర్షం కారణంగా అంపైర్లు ఆటను కాస్త ముందుగానే నిలిపేశారు. ప్రస్తుతం రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 2 వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసింది. ప్రస్తుతం భారత్ 96 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 471 పరుగులు చేయగా.. ఇంగ్లాండ్ 465 పరుగులు చేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...28 సెకన్లు

మరోవైపు.. తెలంగాణాలో రానున్న నాలుగురోజులపాటు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

======================